సాక్షి
కాకినాడ
గురువారం । 6 । మార్చి । 2025



8న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లా పరిధిలోని కోర్టులలో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు.



డెల్టాలకు 9,450 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 9,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.80 అడుగులు ఉంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహర్ శుక్రవారం (ఉదయం)
రాజమండ్రి	6.20	4.56
కాకినాడ	6.20	4.57
అమలాపురం	6.20	4.56

న్యూస్‌రీల్

అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు



బోట్‌క్లబ్ (కాకినాడ): ఈ నెల 12న కాకినాడ నుంచి అరుణాచలం యాత్రకు స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు మూడు రోజుల యాత్రలో ఐదు క్షేత్రాలు చూపించి ఈ నెల 15న కాకినాడ వస్తుందన్నారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, కాళహస్తి దేవాలయాలు చూపిస్తారన్నారు. ఈ యాత్రకు ఒక్కొక్కరికీ రూ.3,100 వసూలు చేయడం జరుగుతుందన్నారు.

ఎవరికో పెద్దరికం?

- 'యనమల'కు మరో'సారీ'నేనా?
- వర్మ ఆశలన్నీ 'చినబాబు'పైనే


యనమల రామకృష్ణుడు


ఎస్‌వీఎస్ వర్మ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నిన్న మొన్నటి వరకు ఆ ఇద్దరూ గురుశిష్యులని గొప్పగా చెప్పుకునే వారు. రాజకీయాల్లో విడదీయలేని దశాబ్దాల బంధం వారిది. గురువు చెప్పినట్టు శిష్యుడు నడుచుకోవడమే తప్ప ఎదురు ప్రశ్నించిన రోజే లేదు. అటువంటి గురుశిష్యులు పెద్దల సభలో చోటు కోసం తలోదారి వెతుక్కుంటున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీల పదవీకాలం ముగిసిపోతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ స్థానాల ఎన్నికకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఫలితంగా కూటమిలో ఎమ్మెల్సీ ఆశావహులు పైరవీలకు తెరతీశారు. ఐదు ఎమ్మెల్సీ స్థానాలలో ఉమ్మడి తూర్పుగోదావరికి ఒక్క స్థానం దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇందుకోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తెలుగుదేశం, జనసేన, బీజేపీల నుంచి ఆశావహులు క్యూలో ఉన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నాయకుడైన యనమల రామకృష్ణుడు తన స్థానాన్ని తిరిగి పునరుద్ధరించుకోవాలనే ప్రయత్నాలు షురూ చేశారు. ఖాళీ అవుతోన్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో యనమల ఖాళీ చేసే స్థానం కూడా ఒకటి కావడం గమనార్హం. తెలుగుదేశం పార్టీలో పార్టీ సీనియర్ అయిన యనమల రామకృష్ణుడు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ, పిల్లి అనంతలక్ష్మి, బీజేపీ నుంచి రాజమహేంద్రవరానికి చెందిన సోము వీర్రాజు తదితరులు ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశిస్తున్నారు. జనసేన నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోదరుడైన నాగబాబుకు ఎమ్మెల్సీ ఇస్తారంటున్నారు. ఆయన మంత్రివర్గంలోకి తీసుకుంటామని నెలన్నర క్రితం స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రకటించారు. ఫలితంగా నాగబాబుకు ఎమ్మెల్సీ, మంత్రి కావడం ఖాయమనుకుని సామాజిక మాధ్యమాల్లో జనసేన శ్రేణులు హల్‌చల్ చేశాయి. కానీ చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీలో నాగబాబుకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్టు తాజాగా తెరమీదకు వచ్చిన సమాచారం. ఇదే విషయం టీడీపీ అనుకూల మీడియాలో విస్తృతంగా జరుగుతోన్న ప్రచారంతో నాగబాబుకు ఇక ఎమ్మెల్సీ లేదనే నిర్ధారణకు పార్టీ వర్గాలు వచ్చేశాయి.

ఈ పరిస్థితుల్లో ఉమ్మడి తూర్పున తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కోసం గట్టి పట్టుబడుతోంది. ఈ స్థానం కోసం నిన్నమొన్నటి వరకు చెట్టపట్టాలేసుకు తిరిగిన గురు, శిష్యులు యనమల, వర్మ ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. చంద్రబాబు తరువాత అంతటి ప్రాధాన్యం కలిగిన నేతగా టీడీపీలో రామకృష్ణుడుకు పేరుంది. జనసేన, కమలనాథులతో కలిసి కూటమిగా టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతోంది. అయినా వీసమెత్తు గుర్తింపు, హోదా దక్కలేదని టీడీపీ సీనియర్ నేత యనమల అంతర్మథనం చెందుతున్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో పార్టీలో ఇంతలా ప్రాధాన్యం లేని రోజులు ఎప్పుడూ చూడలేదనే ఆవేదన అనుచరవర్గం బాహాటంగానే వ్యక్తం చేస్తోంది. తునిలో వరుస పరాజయాలతో ప్రజాక్షేత్రానికి దూరమైన యనమలను పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీని చేసింది. కూటమి గద్దె నెక్కడంతో సీనియర్‌గా తన సేవలు కేబినెట్‌లో వినియోగించుకుంటారను కున్నా ఆ ఆశలు కూడా ఆవిరైపోయిన సంగతి విదితమే. వాస్తవానికి ఇవేమీ కాకున్నా రాజ్యసభకు వెళ్లాలనేది యనమల చిరకాల వాంఛ. సీనియర్‌నైన తనను పక్కనబెట్టి ఎవరెవరినో రాజ్యసభకు పంపిన దగ్గర నుంచి యనమల తీవ్ర అంతర్మథనం చెందుతున్నారని పార్టీ వర్గాల మధ్య చర్చ నడుస్తోంది. ఇటువంటి తరుణంలో పదవీకాలం ముగిసిపోతున్న ఎమ్మెల్సీ స్థానాన్ని పునరుద్ధరిస్తారని యనమల అనుచరవర్గం లెక్కలేసుకుంటోంది. కుమార్తె దివ్యకు తుని అసెంబ్లీ, వియ్యంకుడైన పుట్టా సుధాకర్‌యాదవ్‌కు బద్వేలు అసెంబ్లీ, ఒక అల్లుడు పుట్టా మహేష్‌కుమార్‌కు ఏలూరు ఎంపీ..ఇలా యనమల కుటుంబంలో మూడు కీలక పదవులు అనుభవిస్తున్న పరిస్థితుల్లో రామకృష్ణుడును ఎమ్మెల్సీ కొనసాగించడం కష్టమేనంటున్నారు. నాలుగు దశాబ్దాల పాటు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన యనమల ఎమ్మెల్సీ చాన్స్ కోసం గట్టి ప్రయత్నమే చేస్తున్నారంటున్నారు. కానీ చాన్స్ మాత్రం తక్కువనే ప్రచారం పార్టీలో జరుగుతోంది.

టీడీపీలో యనమల శిష్యుడిగా చెప్పుకునే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ ఈసారి గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. యనమల మాట జవదాటరని పార్టీ నేతలు చెప్పుకునే దానికి భిన్నంగా గురువుకే పంగనామాలు పెట్టే పనిలో వర్మ ఉన్నారంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురంలో పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేయడమే కాకుండా గెలుపు కోసం అనుచరులంతా పడ్డ కష్టానికి తగిన ఫలం దక్కలేదనేది వర్మ ఆవేదన. పిఠాపురం సీటు త్యాగం చేసినందుకు కూటమి అధికారంలోకి వచ్చాక తొలి ఎమ్మెల్సీ వర్మకేనని చంద్రబాబు సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రకటించారు. కూటమి గద్దె నెక్కాక వచ్చిన తొలి ఎమ్మెల్సీ అవకాశాన్ని రాకుండా పవన్ అండ్ కో మోకాలడ్డిందని వర్మ అనుచరులు బాహాటంగానే ప్రచారం చేశారు. రెండు పర్యాయాలు వచ్చిన అవకాశాన్ని ఎగరేసుకుపోయిన పరిస్థితుల్లో ఈసారి ఎట్టి పరిస్థితుల్లో చేజార్చుకోకూడదనే ప్రయత్నాల్లో వర్మ ఉన్నారు. ఈసారి ఎమ్మెల్సీ దక్కించుకోకపోతే జిల్లాలోనే కాకుండా చివరకు పిఠాపురంలో అనుచరుల వద్ద తలెత్తుకు తిరిగే పరిస్థితి ఉండదనే ఆందోళన చెందుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే చినబాబు ద్వారా వర్మ గట్టి లాబీయింగ్ చేస్తున్నారని అనుచరులు చెబుతున్నారు. పదవుల పందేరంలో చాణక్య నీతిని ప్రదర్శించే టీడీపీలో ఉద్దండుడైన గురువు యనమలకు కాకుండా వర్మకు అవకాశం దక్కుతుందా అని కొందర సందేహం వ్యక్తం చేస్తున్నారు. గురుశిష్యుల్లో చివరకు చాన్స్ ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సిందే!

పరిశ్రమల ఏర్పాటుకు త్వరగా అనుమతులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో సింగిల్ డెస్క్ విధానం కింద పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. సింగిల్ డెస్క్ విధానం కింద గడచిన త్రైమాసికంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహనికి వివిధ రాయితీల మంజూరు, ఎంఎస్ఎంఈ సర్వే, పీఎం విశ్వకర్మ యోజన, క్లస్టర్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 36 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 29 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. ఏడు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 46 యూనిట్లకు మొత్తం రూ.4 కోట్ల 88 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదించిందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలతో రూపొందించిన బ్రోచర్‌ను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ, రవాణాశాఖ అధికారి జీవీ శివప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ జి.శ్రీనివాసరావు, గ్రౌండ్‌వాటర్ డీడీ రాధాకృష్ణ, జిల్లా అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు, వివిధ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: జిల్లాలో రబీ-2024-25కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, ట్రాన్స్‌పోర్టు, లీగల్ మెట్రాలజీ, భారత ఆహార సంస్థ అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్ మీనా జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సీఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర వంటి అంశాలపై జేసీ రాహుల్ మీనా అధికారులతో చర్చించారు. ఈ రబీ సీజన్‌లో 5.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాకు గాను, స్థానిక వినియోగానికి 44 లక్షల మెట్రిక్ టన్నులు పోను సుమారు 5.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానుందన్నారు. ఇందులో మిల్లర్ల ద్వారా సుమారు 1.88 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా మిగిలిన 3.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించాల్సి ఉంటుందని జేసీ రాహుల్ మీనా వివరించారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, 75 కేజీలకు రూ.1,740ల, సాధారణ రకం క్వింటాకు రూ.2,300, 75 కేజీలకు రూ.1,725గా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె. శ్రీరమణి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.దేవాల నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎన్.విజయకుమార్, మార్కెటింగ్ ఏడీ కేఆర్ఆర్ నాగేశ్వరరావు, సహకార, ట్రాన్స్‌పోర్టు, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: స్థానిక తిలక్ స్ట్రీట్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మహిళా సాధికారత' కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడ్‌వే సంజీవి హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది సుమారు 100 మంది ఉద్యోగులు, ఖాతాదారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్మరంలో కాకినాడ రీజనల్ హెడ్ సాయిమనోహర్ కాకి, డాక్టర్ కిన్నెర వీణ, డాక్టర్ శ్రావణి, యూనియన్ బ్యాంక్ మహిళా సాధికారత ప్రతినిధులు కె.రాధిక, టి.అర్చన, సీహెచ్ స్పందన పాల్గొన్నారు.

సాయుధ దళాల వార్షిక మొబిలైజేషన్ ముగింపు


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: జిల్లా సాయుధ దళాల వార్షిక మొబిలైజేషన్ బుధవారం ముగిసింది. స్థానిక పరేడ్ మైదానంలో ఈ నెల 15న ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బందికి ఆయుధాల డ్రిల్, ఫైరింగ్, మాబ్ ఆపరేషన్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ గౌరవ వందనం స్వీకరించారు.

వేగంగా రిజిస్ట్రేషన్లు

కాకినాడ లీగల్: ఎటువంటి లోపాలు లేకుండా రిజిస్ట్రేషన్లు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటానని తూర్పుగోదావరి జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) లంకా వెంకటేశ్వర్లు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రయ విక్రయదారులకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎటువంటి సమస్యలొచ్చినా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంగ్లిష్-2 పరీక్ష

బాలాజీచెరువు (కాకినాడ): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నాల్గవ రోజు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంగ్లిష్-2, ఒకేషనల్ ఇంగ్లిష్-2 పరీక్షలు నిర్వహించినట్టు ఇంటర్మీడియెట్ అధికారి నూకరాజు తెలిపారు. జిల్లాలో జనరల్ 17,725 మంది, ఒకేషనల్ 1,482 మంది పరీక్షలకు హాజరయ్యారు.